# కేసీఆర్ 'టీజీఐపాస్'..

"దేశంలో ఉన్న ఉత్తమ విధానాల్లో 'టీజీఐపాస్'"




15 రోజుల్లోనే కంపెనీ ఏర్పాటుకు మార్గం సుగమం

# పరిశ్రమలకు ఫుల్ జోష్!

## ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడంలో ముందు.. సింగిల్ విండో పద్ధతిలో అనుమతుల మంజూరు

## పరిశ్రమల అనుమతి, ఏర్పాటులో జాప్యానికి చెల్లు.. వ్యాపారంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం

## "కేసీఆర్ తెచ్చిన 'టీజీఐపాస్'పై నీతిఆయోగ్ ప్రశంసలు"

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ)/(స్పెషల్ టాస్క్ బ్యూరో): తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు కావాలి. అందుకు కంపెనీలు రావాలి. అది జరుగాలంటే పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలి. అందుకు సులభతర వ్యాపారం చేసే సుహృద్భావ వాతావరణం కల్పించాలి. అలాంటి వాతావరణం ఉండాలంటే మౌలిక సదుపాయాలు, రాయితీలు, ప్రోత్సాహకాలతో పాటు వేగవంతమైన అనుమతులకు మార్గం ఉండాలి. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ మనస్సులో మెదిలిన ఈ ఆలోచనలకు కార్యరూపమే.. టీజీఐపాస్ (తెలంగాణ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్). సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) అనుమతుల కోసం కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన టీజీఐపాస్‌ను ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే పలువురు నిపుణులు ప్రశంసించారు. తాజాగా కేంద్రప్రభుత్వ మేధోసంస్థ నీతిఆయోగ్ కూడా టీజీఐపాస్‌ను దేశంలోనే ఉత్తమ విధానాల్లో ఒకటిగా కొనియాడింది. ఈ మేరకు 'డిజైనింగ్ ఏ పాలసీ ఫర్ మీడియం ఎంటర్‌ప్రైజెస్' పేరుతో తాజాగా విడుదల చేసిన నివేదికలో పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

### 15 రోజుల్లోనే అనుమతులు

ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడానికి దేశంలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాల్లో టీజీఐపాస్ ఒకటని నీతిఆయోగ్ ప్రశంసించింది. టీజీఐపాస్ ద్వారా ఎంఎస్ఎంఈ అనుమతుల్లో జాప్యాన్ని తగ్గించడంతోపాటు తనిఖీలను కనిష్టస్థాయికి చేర్చినట్లు తన నివేదికలో పేర్కొంది. సింగిల్ విండో పద్ధతిలో లభించే అనుమతులకు 15 రోజుల గడువు నిర్ధారించడాన్ని నివేదిక కొనియాడింది. తద్వారా అనవసర జాప్యాలు లేకుండా వ్యాపారాలు ప్రారంభించడానికి, విస్తరించడానికి ఈ చట్టం దోహదపడుతున్నదని తెలిపింది. వ్యాపారంలో ఏర్పడే సంక్లిష్టతలను కూడా ఈ విధానం తగ్గించినట్టు చెప్పింది. చట్టబద్ధమైన నిబంధనల అమలులో స్వీయధ్రువీకరణను ఈ విధానం అనుమతిస్తున్నదని గుర్తుచేసింది. తనిఖీల సంఖ్యను గణనీయంగా తగ్గించడంతో వ్యాపార విస్తరణకు దోహదపడినట్టు ప్రశంసించింది. మొత్తంగా టీజీఐపాస్‌ను దేశంలోనే ఉత్తమ విధానాల్లో ఒకటిగా తేల్చిచెప్పింది. టీఐడియా, టీప్రైడ్ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీలతోపాటు జనరల్ కేటగిరీ వారికి, మహిళలకు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్టు నివేదిక పేర్కొంది. అంతేకాకుండా పరిశ్రమల కోసం భూమి కొనుగోళ్లపై స్టాంప్ డ్యూటీని 100 శాతం రీయంబర్స్ చేయడంతోపాటు పరిశ్రమలకు వివిధ రకాల సబ్సిడీలను ఈ చట్టం ద్వారా అందిస్తున్నట్టు నీతి ఆయోగ్ ప్రశంసించింది. కాగా నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ గతంలో అనేక సందర్భాల్లో టీజీఐపాస్‌పై ప్రశంసలు కురిపించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగం అభివృద్ధికి కృషిచేస్తున్నదని కొనియాడారు.



### టీజీఐపాస్ గ్రేట్

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధి కోసం బీఆర్ఎస్ సర్కారు అమలు చేస్తున్న టీజీఐపాస్ అద్భుతం. ఈ విధానానికి సంబంధించి సమగ్ర సమాచారం అందిస్తే అధ్యయనం చేస్తాం.

-కేంద్రమంత్రి పీయూష్ గోయల్ (27.08.2020)

### టీజీఐపాస్ అద్భుతం

టీజీఐపాస్ అద్భుతం. 12 రోజుల్లోనే మా సంస్థకు అనుమతులిచ్చారు. ఇది నూతన పారిశ్రామిక విధాన శక్తిసామర్థ్యాలకు నిదర్శనం. కేసీఆర్ గారూ మీ నాయకత్వం అద్భుతం.

-ఐటీసీ చైర్మన్ వైసీ దేవేశ్వర్ (30.06.2015)

### లక్షల మందికి ఉపాధి

టీజీఐపాస్‌తో తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి సాధ్యమైంది. రాష్ట్రానికి కంపెనీలు క్యూకట్టాయి. లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించాయి.

-ఎంఎస్ఎంఈ ఈపీసీ, బిల్‌మార్ట్ ఫిన్‌టెక్ సంయుక్త అధ్యయనం (16.06.2022)

### తెలంగాణ పాలసీ భేష్

తెలంగాణ ఇండస్ట్రియల్ పాలసీ అద్భుతంగా ఉంది. ఇక్కడ పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉన్నది. భారత్-అమెరికా వాణిజ్యానికి హైదరాబాద్ కేంద్ర స్థానంగా ఉన్నది.

-అమెరికా రాయబారి ఎలిజబెత్ జోన్స్ (10.01.2023)

### దేశంలోనే అత్యుత్తమం

టీజీఐపాస్ పరిశ్రమలకు సత్వర అనుమతులను ఇచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన టీజీఐపాస్ దేశంలోనే అత్యుత్తమ చట్టం. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో పరిశ్రమల అభివృద్ధికి సర్కారు కృషి గొప్పగా ఉన్నది.

-భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) దక్షిణ ప్రాంత చైర్మన్ సీకే రంగనాథన్ (27.10.2021)

### అలా టీజీఐపాస్‌కు శ్రీకారం

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై బీఆర్ఎస్ ప్రభుత్వం కొలువుదీరాక అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్ర బహుముఖాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే వ్యవసాయ రంగ అభివృద్ధికి నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించిన విధంగానే పారిశ్రామికీకరణ కోసం అత్యుత్తమ చట్టాన్ని తేవాలని నిశ్చయించారు. నిత్యం కరెంటు కోతలు, పవర్ హాలీడేలతో సతమతమవుతున్న పరిశ్రమల రంగాన్ని గట్టెక్కించడమే కాకుండా దేశానికే ఆదర్శంగా నిలపాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే సమస్యలు తెలుసుకునేందుకు పరిశ్రమ వర్గాలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు తొమ్మిది గంటలపాటు సాగిన ఈ సమావేశంలో పారిశ్రామికవేత్తలు తమకు నిరంతర విద్యుత్తు ఇవ్వాలని కోరారు. అనుమతుల్లో తలెత్తుతున్న ఇబ్బందులు, మితిమీరిన జాప్యాన్ని నివారించాలని ఈ సందర్భంగానే విజ్ఞప్తిచేశారు. దీంతో కేసీఆర్ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ టీజీఐపాస్ విధానాన్ని ప్రవేశపెట్టారు.

### వెల్లువెత్తిన పెట్టుబడులు

దేశంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు, అనుమతులు రావడంతో పరిశ్రమ వర్గాల్లో ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. దీనికి తోడు మండు వేసవిలో సైతం రెప్పపాటు కూడా కరెంటు పోకపోవడంతో బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలు మూడు షిఫ్టుల్లో నడిచాయి. దీంతో దేశవిదేశాల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ పేరుగాంచింది. ప్రపంచంలోని అనేక పేరుగాంచిన పరిశ్రమలు, ఐటీ, ఔషధ కంపెనీలు రాష్ట్రానికి క్యూకట్టాయి. అప్పటి పరిశ్రమల మంత్రి కేటీఆర్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం జరిపిన విదేశీ పర్యటనల సందర్భంగా టీజీ ఐపాస్ గురించి వివరించగానే ఆయా కంపెనీల ప్రతినిధులు ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి విధానం లేదని ప్రశంసలు కురిపించారు. టీజీఐపాస్ కారణంగా రాష్ట్రానికి పరిశ్రమలు క్యూకట్టాయి. టీజీఐపాస్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ విధానం ద్వారా 27,424 కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటయ్యాయి. ఇందులో 24,771 కంపెనీలు తయారీరంగానికి చెందినవి కాగా సేవారంగానికి చెందిన కంపెనీలు 2,648గా ఉన్నాయి. మొత్తంగా రూ. 2,99,974.04 కోట్ల పెట్టుబడులు రాగా, 18,83,746 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

**టీజీఐపాస్‌తో ఏం జరిగిందంటే?**

| ఆర్థిక సంవత్సరం | పరిశ్రమలు | పెట్టుబడులు రూ. కోట్లలో | ఉద్యోగాలు |
|---|---|---|---|
| 2014-15 | 174 | 1,805.80 | 5,051 |
| 2015-16 | 1,526 | 28,954.60 | 94,196 |
| 2016-17 | 1,697 | 33,493.25 | 95,062 |
| 2017-18 | 2,789 | 57,661.01 | 2,73,362 |
| 2018-19 | 2,776 | 34,214.65 | 5,99,358 |
| 2019-20 | 3,004 | 40,068.36 | 3,14,825 |
| 2020-21 | 3,383 | 16,047.36 | 1,62,597 |
| 2021-22 | 4,008 | 18,149.61 | 99,717 |
| 2022-23 | 3,108 | 26,917.88 | 1,01,012 |
| 2023-24 | 2,664 | 28,123.17 | 84,506 |
| 2024-25 | 2,051 | 13,723.25 | 50,180 |
| 2025-26 | 244 | 815.10 | 3,880 |
| మొత్తం | 27,424 | 2,99,974.04 | 18,83,746 |

### టీజీఐపాస్‌తో ఏం జరిగిందంటే?

రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు **27,424**

తయారీ రంగం **24,771** | సేవారంగం **2,648**

ఇతర రంగాలు - **5**

మొత్తం పెట్టుబడులు **2,99,974.04** కోట్లు

లభించిన ఉద్యోగాలు **18,83,746**

### టీజీఐపాస్ ఎప్పుడు.. ఎలా?

- డిసెంబర్ 3, 2014- టీజీఐపాస్ చట్టానికి గవర్నర్ ఆమోదం
- జూన్ 12, 2015-టీజీఐపాస్ సేవలు ప్రారంభం
- ఏప్రిల్ 1, 2016-ఆన్‌లైన్‌లో టీజీఐపాస్ సేవలు ప్రారంభం

### టీజీఐపాస్ ప్రత్యేకతలు

**సింగిల్‌విండో విధానం:** పరిశ్రమకు అవసమైన అన్ని అనుమతులు, ప్రోత్సాహకాలు ఒకేచోట

**ల్యాప్‌టాప్ ఉంటే చాలు:** ఇంటినుంచి కాలు బయట పెట్టకుండానే దరఖాస్తులు, అనుమతులు అన్నీ ఆన్‌లైన్‌లోనే

**వేరేవాళ్లు అక్కర్లేదు:** స్వీయ ధృవీకరణ (సెల్ఫ్ సర్టిఫికేషన్) ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు

**అనుమతులకు గడువు:** 15 రోజుల్లోగా అనుమతుల జారీ, అనుమతులకు గరిష్ఠ సమయం 30రోజులు

**అనుమతులు ఇవ్వకుంటే?:** అనుమతులు రాకుంటే డీమ్డ్ అప్రూవల్ పొందే వెసులుబాటు

**అనుమతులు ఇవ్వనివారికి:** బాధ్యులైన అధికారికి రోజుకు రూ. 1000చొప్పున జరిమానా



# ..మదన్‌లాల్ ఇకలేరు

మొదటిపేజీ తరువాయి...

మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదన్‌లాల్ మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మదన్‌లాల్ ప్రస్థానం..

మదన్‌లాల్ ఈర్లపూడి ఎంపీటీసీగా, సర్పంచ్‌గా పలు పర్యాయాలు పనిచేశారు. 2012లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున వైరా ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. ఆ తరువాత 2018, 2023 శాసన సభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మదన్‌లాల్ వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా ఉన్నారు. మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. కోడలు సైతం తమిళనాడు క్యాడర్‌లో ఐఏఎస్ ఆఫీసర్‌గా ఉన్నారు. మదన్‌లాల్ ఆకస్మిక మృతితో వైరా నియోజకవర్గ వ్యాప్తంగా విషాదఛాయలు అలుముకున్నాయి. స్వగ్రామం ఈర్లపూడి శోకసంద్రమైంది. ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి ఖమ్మం నగరంలోని అతడి నివాసానికి తీసుకురాగా అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు.

### నిబద్ధత కలిగిన నేతను కోల్పోయాం: కేటీఆర్

మదన్‌లాల్ అకాల మరణం కలిచివేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారం వ్యక్తంచేశారు. పార్టీ నిబద్ధత, నిజాయతీ కలిగిన నేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతగానో పరితపించారని కొనియాడారు. బీఆర్ఎస్ అభివృద్ధికి మదన్‌లాల్ సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతి గిరిజన, బలహీనవర్గాలకు తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



ఖమ్మంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

### పలువురి నివాళి

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఖమ్మంలోని మదన్‌లాల్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్‌ను ఓదార్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మదన్‌లాల్ ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, రాములునాయక్, మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు.

### ప్రముఖుల సంతాపం

మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మృతి పట్ల మాజీ మంత్రులు టీ హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, సీనియర్ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి, వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి తదితరులు సంతాపం ప్రకటించారు. మదన్‌లాల్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు కోరారు.

### మదన్‌లాల్ కుమారుడికి కేసీఆర్ ఫోన్

ఖమ్మం, మే 27: మదన్‌లాల్ మృతికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని మదన్‌లాల్ ఇంటి వద్ద నుంచి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర.. కేసీఆర్‌కు ఫోన్ చేసి మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్‌తో మాట్లాడించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మృగేందర్‌లాల్‌తో మాట్లాడుతూ 'మీ తండ్రి మదన్‌లాల్ నాకు సన్నిహితుడు, నిబద్ధత కలిగిన మంచి నాయకుడు. ఆయన అకాల మరణం తీవ్ర బాధాకరం' అని అన్నారు. మదన్‌లాల్ ఇక లేరనే నిజాన్ని నమ్మలేకపోతున్నానని చెప్పారు. తల్లి మంజుల, సోదరి మనీషా లక్ష్మీని ఓదార్చారు. 'మీ కుటుంబానికి నాతోపాటు పార్టీ నేతలు అండగా ఉంటారు' అని భరోసానిచ్చారు.

# తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులది కీలకపాత్ర

- టీజేఎఫ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): ఈ నెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహిస్తున్న టీజేఎఫ్ రజతోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం గన్‌పార్క్ వద్ద మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఉద్యోగాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని కొనియాడారు. టీజేఎఫ్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, జర్నలిస్టు సంఘాల నేతలు ఏ రమణ కుమార్, యోగానంద్, అవ్వారి భాస్కర్, రాకేశ్ రెడ్డి, సోమేశ్వర్, యారా నవీన్, రమణ, శివారెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, రవికుమార్, భూపతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





## ఆటో డ్రైవర్ బలవన్మరణం

- ఉచిత బస్సుతో ఆటోలు నడవక పెరిగిన అప్పులు
- తీర్చే మార్గం లేకపోవడంతో పురుగుల మందుతాగి మృతి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం

ఇల్లెందు, మే 27 :కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వల్ల ఆటోలు నడవకపోవడం.. పొద్దంతా పడిగాపులు కాసినా ఆటో ఎక్కేవారు లేకపోవడం.. దీనికితోడు కుటుంబ పోషణ భారం కావడం.. అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ ఆటో డ్రైవర్ పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ చోటుచేసుకున్నది. . సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణంలోని 14వ నంబర్ బస్తీకి చెందిన పాసి దుర్గాప్రసాద్(రాజేందర్) (45) జగదాంబ సెంటర్ అడ్డాలో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా.. వారిలో ఒక కుమార్తె పెళ్లి చేశాడు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో సరిగ్గా నడవకపోవడం, కూతురు పెళ్లి చేయడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన దుర్గాప్రసాద్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి ఆటో తీసుకొని వెళ్లాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో పురుగుల మందుతాగి మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య మీనా కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సుతో ఆటోలు సరిగా నడవకపోవడం.. ఆర్థిక సమస్యలు తలెత్తడంతో దుర్గాప్రసాద్ బలవన్మరణానికి పాల్పడినట్టు ఆటో యూనియన్ నాయకులు ఆరోపించారు.

# ఆటో డ్రైవర్లపై ద్వేషమెందుకు?

- ఆటోడ్రైవర్లను నమ్మించి మోసగించిన కాంగ్రెస్
- బాధిత డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి
- వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ నాయకుల డిమాండ్
- హైదరాబాద్‌లో ముగిసిన ఆటో జేఏసీ రథయాత్ర

హైదరాబాద్ సిటీబ్యూరో, కవాడిగూడ, మే 27(నమస్తే తెలంగాణ): ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయకుంటే ఎక్కడికక్కడ ఆటో డ్రైవర్లమంతా ఆమరణ దీక్షలకు దిగుతామని తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 25న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రారంభమైన ఆటో రథయాత్ర మంగళవారం నాటితో ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద 'ఆటో డ్రైవర్ల ఆకలి కేకలు' మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలు నాటి నుంచి నేటి వరకు రాష్ట్రంలో 83 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధిత కుటుంబాలన్నింటినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల జీవన భృతి కల్పిస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని మండిపడ్డారు. వెయ్యి కోట్లతో ఆటో కార్మికుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారనికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చకుంటే ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య, బీఎంఎస్ ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ హబీబ్, టీయూసీఐ నాయకులు ఉయ్యాల ప్రవీణ్, సాయిలు, ఆటో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన ఆటో డ్రైవర్ల ఆకలి కేకలు మహాసభలో సమస్యలు చెప్పుకొని విలపిస్తున్న ఓ ఆటో డ్రైవర్

### తెలంగాణ ఆటో జేఏసీ డిమాండ్లు ఇవే

- ప్రభుత్వం ప్రకటించిన రూ.12 వేల జీవన భృతిని ఏడాదికి కాకుండా నెలవారీగా ఇచ్చేందుకు అమలు చేయాలి.
- ఓలా ఊబర్, ర్యాపిడో సంస్థలు అక్రమంగా నడుపుతున్న టూ వీలర్లను వెంటనే నిషేధించి ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వేస్టేషన్లు, బస్ డిపోల వద్ద ఆటోలకు పార్కింగ్ స్థలాలను కేటాయించాలి.
- గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో మీటర్ల రేట్లను పెంచి ఆటోలకు స్టేట్ పర్మిట్ ఇవ్వాలి.
- ఏడున్నర లక్షల మంది ఆధారపడిన ఆటో కార్మిక రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అతి పెద్ద పరిశ్రమగా గుర్తించాలి.
- ప్రమాదాల్లో మరణించిన ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఆటో బీమా ద్వారా రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయాలి.
- ప్రమాద బీమా రుసుం రూ.8 వేల నుంచి రూ.వెయ్యికి తగ్గించాలి.
- ఆటోడ్రైవర్లపై ప్రైవేట్ ఫైనాన్సియర్ల ఆగడాలను అరికట్టి వడ్డీ శ్లాబు విధానాన్ని తొలగించాలి.
- ఇండ్లు లేని ఆటో డ్రైవర్లకు ఇండ్లు కేటాయించి నిర్మించి ఇవ్వాలి.
- వెయ్యి కోట్లతో ఆటో కార్మికుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



## ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్టు

### 'చలో హైదరాబాద్'కు వెళ్లకుండా కట్టడి

నమస్తే నెట్‌వర్క్, మే 27: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు మంగళవారం నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు కట్టడిచేశారు. మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్, కన్నెపల్లి, కాసిపేట, మందమర్రి మండలాల్లోని ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## జనాభా లెక్కల షెడ్యూల్ విడుదల చేయాలి

- జాతీయ బీసీ దళ్ డిమాండ్

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): కులగణన నిర్వహిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం సంబంధించిన షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని జాతీయ బీసీ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జనాభా గణనతోపాటు కులగణనను నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కులగణనను తక్షణమే చేపట్టి, జనాభా లెక్కల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం అవసరమైన డాటా సేకరణ జరగాలని అన్నారు.